ఖానాపురం: సంగెం కాల్వ ద్వారా వచ్చిన వరదతో ఇసుక మేటలు వేయడంతో దెబ్బతిన్న వరిపొలం

సంగెం: మత్తడి దుంకుతున్న ఎల్గూర్‌చెరువు

చెన్నారావుపేట: జల్లి శివారులో నేలవాలిన మక్కజొన్న పంట

నర్సంపేట రూరల్: గురిజాలలో వర్షానికి కూలిన ఇల్లు

పంటలకు తీవ్ర నష్టం

- జిల్లాలో దెబ్బతిన్న వరి, మక్కజొన్న, పత్తి
- పంటకాల్వలు, రోడ్లకు గండ్లు, ఇండ్లు ధ్వంసం
- పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- జలదిగ్బంధంలోనే వరంగల్‌లోని పలు కాలనీలు

మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పాకాల పంట కాల్వలు, రోడ్లకు గండ్లు పడ్డాయి. కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో చెరువులు అలుగు పోస్తున్నాయి. వరంగల్ నగరంలోని పలు కాలనీలు ఇంకా జలదిగ్బంధంలోనే చిక్కుకున్నాయి.

ఖిలావరంగల్: శివనగర్‌లో నాలాల్లో పేరుకుపోయిన చెత్తాదారాన్ని తొలగిస్తున్న జీడబ్ల్యూఎంసీ కార్మికులు

జలమయమైన కాశీబుగ్గలోని సుందరయ్యనగర్ రోడ్డు

ఖానాపురం/సంగెం/చెన్నారావుపేట, సెప్టెంబర్ 2: ఖానాపురం మండలం పాకాల ఆయకట్టులోని తుంగబంధం, సంగెం, జాలుబంధం కాల్వలకు గండ్లు పడడంతో నీరంతా పంట పొలాల మీదుగా వృథాగా పోతున్నది. వెంటనే అధికారులు గుర్తించి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. సంగెం కాల్వ నీళ్లు పంట పొలాల్లోకి చేరడంతో ఇసుక మేటలు వేశాయి. పత్తి చేన్లు నేలకొరిగాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే, పాకాల సరస్సు మత్తడి దుంకుతున్నది. దీంతో అశోక్‌నగర్ శివారు లోలెవల్ కాజ్‌వేపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కొత్తగూడ, నర్సంపేటకు సోమవారం రెండో రోజు రాకపోకలు నిలిచిపోయాయి. రెవెన్యూ, పోలీస్ అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి, రెవెన్యూ సిబ్బంది కాపలా కాస్తున్నారు. కాజ్‌వేను తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎస్సై రఘుపతి పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సంగెం మండలం ఎల్గూర్ పెద్ద చెరువు మత్తడి దుంకుతున్నది. సంగెం, కుంటపల్లి, కాట్రపల్లి, చింతలపల్లి చెరువులు అలుగు పోస్తుండడంతో ఆ నీరంతా ఎల్గూర్ పెద్ద చెరువులోకి చేరుతున్నది. మండలంలోని అన్ని చెరువులు, కుంటలు మత్తళ్లు దుంకుతుండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంగెం మండలం గొల్లపల్లి శివారులోని మహ్మద్‌సాబ్ కుంటకు బుంగ పడింది. ఐబీ అధికారులు సందర్శించి గ్రామస్తుల సహాయంతో జేసీబీతో బుంగను పూడ్చారు. వంజరపల్లికి చెందిన గనిపాక కుమారస్వామి ఇంట్లోకి నీరు చేరడంతో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో రవీందర్ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. సంగెంలో హెల్ప్‌డెస్క్ 24 గంటలపాటు పని చేస్తుందన్నారు. చెన్నారావుపేట మండలంలోని పలు గ్రామాల్లో మక్కజొన్న పంట నేలవాలింది. చెరువులు మత్తళ్లు దుంకుతుండగా, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరి పంట నీట మునిగింది. కోపాకుల చెరువు మత్తడి ఉధృతికి చాలా ఎకరాల్లో వరి పంట రెండు రోజులుగా నీటిలోనే మునిగి ఉంది. పత్తి పంట కూడా దెబ్బతిన్నదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వర్షానికి దెబ్బతిన్న పంటలు

నర్సంపేటరూరల్: నర్సంపేట మండలంలోని అన్ని చెరువులు, కుంటలు అలుగు పోస్తున్నాయి. మాదన్నపేట శివారులోని మాదన్నపేట పెద్ద చెరువు సోమవారం రెండు ఫీట్ల మందంతో మత్తడి పోసింది. మండలంలో వందలాది ఎకరాల్లో వరి, పత్తి, మక్కజొన్న పంటలు నీట మునిగాయి. మాదన్నపేట, గురిజాల, లక్నేపల్లి శివారుల్లోని లో-లెవల్ కాజ్‌వేలను తాకుతూ వరద ఉధృతంగా ప్రవహిస్తున్నది. గురిజాల, లక్నేపల్లి, మాదన్నపేట, ముత్తోజిపేటలో పలు పాత ఇండ్లు వర్షాలకు కూలిపోయాయి. నాగుర్లపల్లి శివారు నర్సంపేట-నల్లబెల్లి ప్రధాన రహదారిలోని లో-లెవల్ కాజ్‌వే పైనుంచి వరద నీరు ప్రవహించింది. మాదన్నపేట పెద్ద కాల్వ ఉధృతంగా ప్రవహించడంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు పరిశీలించారు.

జలదిగ్బంధంలో నగరం

గిర్మాజీపేట/ఖిలావరంగల్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు హంటర్‌రోడ్‌లోని లోతట్టు ప్రాంతాలైన బృందావన్, ఎన్టీఆర్‌నగర్, సాయినగర్‌కాలనీలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. ఏటా వర్షాకాలంలో ఆయా కాలనీ వాసులకు కంటి మీద కునుకులేకుండా అవుతున్నది. ఎన్నో ప్రభుత్వాలు మారినా లోతట్టు ప్రాంత ప్రజల సమస్యకు పరిష్కారం లభించడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేసున్నారు. కాగా, పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న వరద బాధితులకు ఉదయం టిఫిన్, భోజన సదుపాయాలు కల్పించి, దుప్పట్లు పంపిణీ చేశారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

ఖిలావరంగల్/కరీమాబాద్/కాశీబుగ్గ/నెక్కొండ/పర్వతగిరి: ఖిలావరంగల్‌లోని అగడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో శివనగర్, మైసయ్యనగర్ జలదిగ్బంధంలో ఉన్నాయి. రోడ్డుకు అడ్డుగా పడిపోయిన చెట్టును జీడబ్ల్యూఎంసీ సిబ్బంది తొలగించారు. శివనగర్‌లో నాలాలు, డ్రైనేజీలను శుభ్రం చేసి వరద నీటిని మళ్లించారు. మైసయ్యనగర్‌లో ఇండ్లలో వరద నీరు ఉండడంతో మహిళలు బకెట్లతో తోడి బయట పోశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగారపు బాబు, నలిగంటి రత్నమాలతోపాటు నాయకులు ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరంగల్ 37వ డివిజన్ గిరిప్రసాద్‌నగర్‌లో ముంపు ప్రాంతాల ప్రజలకు కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ దుప్పట్లు పంపిణీ చేశారు. మధ్యకోటలో పంట పొలాల్లోకి భారీగా వరద నీరు చేరింది. దీంతో వ్యవసాయ క్షేత్రాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. 41వ డివిజన్‌లోని పలు కాలనీలను కార్పొరేటర్ పోశాల పద్మ గ్రేటర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం పునరావాస కేంద్రాల్లోని ప్రజలకు ఆహారం అందజేశారు. ఆమె వెంట పోశాల స్వామి, బల్దియా అధికారులు ఉన్నారు. వరంగల్ 14వ డివిజన్‌లోని ఎస్ ఆర్‌నగర్, సాయిగణేశ్‌కాలనీ, లక్ష్మీగణపతికాలనీ, మధురానగర్, సుందరయ్యనగర్, 19వ డివిజన్‌లోని వివేకానందకాలనీ, ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌రోడ్డులో వరదనీరు డ్రైనేజీల ద్వారా బయటకు వెళ్లింది. 20 డివిజన్‌లోని పద్మనగర్, శాంతినగర్‌లో బురద చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. 12వ డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరిశీలించి మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. 19వ డివిజన్ గాంధీనగర్‌లో కాంగ్రెస్ 19వ డివిజన్ అధ్యక్షుడు దాసరి రాజేశ్ ఆహారం పంపిణీ చేశారు. నెక్కొండ ఊరచెరవు మత్తడి వద్ద పడిన బుంగను ఆదివారం రాత్రి రెవెన్యూ, పోలీసు అధికారులు పూడ్చి చెరువును ప్రమాదం నుంచి తప్పించారు. వెంకటాపురం కాజ్‌వే వద్ద దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేశారు. పెద్దకోర్వోలు సమీపంలో బీటీ రోడ్డు సైడ్ బర్మ్ కొట్టుకుపోగా తాత్కాలిక మరమ్మతులు చేశారు. పర్వతగిరి మండలంలోని బూరుగుమళ్ల గ్రామంలో చెరువు మత్తడి ఉధృతంటీ ప్రవహించడంతో వరి పొలాల్లో ఇసుక మేటలు వేసింది.

కరీమాబాద్: ఆహారం అందజేస్తున్న కార్పొరేటర్ పోశాల పద్మ

5.35 సెంటీమీటర్ల వర్షపాతం

ఖిలావరంగల్: జిల్లాలో 5.35 సెంటీమీటర్ల వర్షం నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. సంగెంలో 10 సెంటీమీటర్లు, వర్ధన్నపేటలో 8.66, ఖిలావరంగల్‌లో 8.42, చెన్నారావుపేటలో 8.02, నెక్కొండలో 7.02, రాయపర్తిలో 6,92, గీసుగొండలో 4.98, నర్సంపేటలో 1.58, ఖానాపురంలో 2.2, పర్వతగిరిలో 6,4, వరంగల్‌లో 4.41 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. దుగ్గొండి, నల్లబెల్లి మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి

సంగెం/గీసుగొండ, సెప్టెంబర్ 2: మొండ్రాయి-నల్లబెల్లి ప్రధాన రోడ్డు కొట్టుకుపోగా, సోమవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వెంటనే పునరుద్ధరించాలని కాంట్రాక్టర్‌కు ఫోన్‌లో సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ జి.రాజ్‌కుమార్, ఎంపీడీవో రవీందర్, నాయకులు జనగాం రమేశ్, మడత కేశవులు, నర్సింహానాయక్, మల్లారెడ్డి, నరహరి, ప్రభాకర్ ఉన్నారు. గీసుగొండ మండలం మనుగొండ నర్సింహుల చెరువుతోపాటు వర్షానికి కొట్టుకుపోయిన మనుగొండ నాగయ్యపల్లి రోడ్డును రేవూరి పరిశీలించారు. ఎమ్మెల్యే ట్రాక్టర్ నడుతూ అధికారులతోపాటు నాయకులతో కలిసి కట్టపైకి వెళ్లారు. అధికారులు నర్సింహుల చెరువు కట్టపై దృష్టి పెట్టి ప్రమాదం జరగకుండా చూడాలన్నారు. అంతేకాకుండా వంచనగిరి, కోనాయిమాకులకు చెందిన గుడిసె వాసులు ఎమ్మెల్యేను అయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇండ్ల స్థలాలు ఇస్తామని రేవూరి హామీ ఇచ్చినట్లు గుడిసె వాసులు తెలిపారు.


చెరువు కట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

చెరువుకట్టకు తాత్కాలిక మరమ్మతులు

వర్ధన్నపేట, సెప్టెంబర్ 2: భారీ వర్షాల వల్ల కోనారెడ్డి చెరువుకట్టకు బుంగ పపడడంతో ఐబీ అధికారులు సోమవారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. చెరువుకట్టను ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పరిశీలించారు. వెంటనే బుంగ పడుతున్న ప్రాంతంలో ఇసుక బస్తాలు వేసి కట్టకు ప్రమాదం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే, కొత్తపల్లి సమీపంలో కోతకు గురైన రోడ్డు, ఇల్లందలో ముంపునకు గురైన ఎస్సీకాలనీ, వర్ధన్నపేటలోని పలు కాలనీలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ, కౌన్సిలర్లు, నాయకులు నిమ్మాని శేఖర్‌రావు, చోటు, సత్యనారాయణ, పులి శ్రీను, మైస అర్జున్ పాల్గొన్నారు.

సస్యశ్యామలం చేస్తా : ఎమ్మెల్యే దొంతి

నల్లబెల్లి, సెప్టెంబర్ 2: గోదావరి జలాలతో రంగాయ, ఎర్రాయి చెరువులను అనుసంధానం చేసి నర్సంపేట నియోజకవర్గంలోని 36 వేల ఎకరాలకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేయడమే లక్ష్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. రంగాయ చెరువు ప్రాజెక్ట్ రీడిజైనింగ్‌పై లేవనెత్తిన అంశంపై ఏజెన్సీ గ్రామాల ప్రజలు అభ్యంతరం చెబుతూ మూడు రోజులుగా నిరసనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఇటీవల రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన దేవాదుల ప్రాజెక్ట్ సమీక్షలో పాత పద్ధతిలో నిధులు విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. అయితే, ప్రజల అభిప్రాయం మేరకు పనులు చేస్తామని, రైతులు ఆందోళన చెందొద్దని కోరారు.

కుమారస్వామికి మద్దతు తెలియజేస్తున్న ప్రతినిధులు

'బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి'

వరంగల్‌చౌరస్తా, సెప్టెంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి సభలో రేవంత్‌రెడ్డి ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకటరాములు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని కోరుతూ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన చాపర్తి కుమారస్వామిని సోమవారం ఎంజీఎం దవాఖానలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాష్ట్రవ్యాప్తంగా బీసీకుల గణన చేపట్టడంతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని, ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పినట్లు గుర్తుచేశారు. వెంటనే ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి నెదునూరి రాజమౌళి, బీసీ నాయకులు ధర్మపురి రామారావు, బేతి నరేశ్, కొడారి రమేశ్, కేడెల ప్రసాద్ పాల్గొన్నారు.

అధికారుల తప్పిదంతో రుణమాఫీ కాలేదు

గీసుగొండ, సెప్టెంబర్ 2: బ్యాంకు, వ్యవసాయ శాఖ అధికారుల తప్పుదంతో ధర్మారం ఇండియన్ బ్యాంకు పరిధిలో ఉన్న వెయ్యి మంది రైతులకు రుణమాఫీ కాలేదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్ మండిపడ్డారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారులు నిర్లక్ష్యం వీడాలని కోరారు. ప్రతి రైతుకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రుణమాఫీ చేసి చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు.

ఇటుకాలపల్లిలో ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నీరు నిల్వకుండా చూడాలి: ఎంపీడీవో

నర్సంపేటరూరల్/పర్వతగిరి, సెప్టెంబర్ 2: మన చుట్టూ ఉన్న పరిసరాల్లో వర్షం, మురుగునీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో అంబాల శ్రీనివాసరావు సూచించారు. సోమవారం ఆయన ఇటుకాలపల్లి, ముత్తోజిపేట, ఆకులతండాలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. అలాగే, పర్వతగిరి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాలోత్ శంకర్‌నాయక్ సమీక్షించారు. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఏపీవో సుశీల్‌కుమార్, ఈసీ రాజు, టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

త్వరగా విద్యుత్‌ను పునరుద్ధరించాలి

వివరాలు తెలుసుకుంటున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

చెన్నారావుపేట, సెప్టెంబర్ 2: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని విద్యుత్ ఉప కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. దెబ్బతిన్న స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని, సరఫరాలో అంతరాయం ఉండొద్దని సూచించారు. సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. వర్షాలు పడుతున్నందున వినియోగదారులు విద్యుత్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. స్వతహాగా విద్యుత్ మరమ్మతులు చేపట్టొద్దని కోరారు. కార్యక్రమంలో నర్సంపేట డీఈఈ శ్రీధర్, ఏడీఈ లక్ష్మణ్, మల్లేశం, చెన్నారావుపేట ఏఈ జోగానంద్ పాల్గొన్నారు.

వానకాలంలో కల్వర్టుల నిర్మాణమా..!?

కాంట్రాక్టర్‌పై ప్రజల ఆగ్రహం

సంగెం, సెప్టెంబర్ 2: వేసవి కాలంలో చేయాల్సిన పనులు వానకాలంలో చేస్తే ఎలా ఉంటుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మచ్చాపూర్ నుంచి మొండ్రాయి మీదుగా చెన్నారావుపేట వరకు డబుల్ రోడ్డు (ఆర్‌అండ్‌బీ) వేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం ఏర్పడింది. ఇందులో పల్లార్‌గూడ, మొండ్రాయి, ముమ్మిడివరం, నల్లబెల్లి పరిధిలో కల్వర్టుల నిర్మాణం జరగలేదు. దీంతో గత ఆగస్టు నెలలో కల్వర్టు నిర్మించేందుకు ముమ్మిడివరం-నల్లబెల్లి మధ్యలో రోడ్డును తవ్వి చెరువులో నుంచి డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద ఉధృతికి డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో పది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కల్వర్టుల నిర్మాణం వేసవి కాలంలో చేపడితే ఎవరికీ ఇబ్బందులు ఉండేవి కావని, వర్షాకాలంలో పనులు మొదలు పెట్టడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మిడివరం-నల్లబెల్లి మధ్య కల్వర్టు నిర్మాణం కోసం తవ్విన ఆర్‌అండ్‌బీ రోడ్డు

పునరావాస కేంద్రాల పరిశీలన

కరీమాబాద్, సెప్టెంబర్ 2: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ మేరకు అండర్ రైల్వేగేట్ ప్రాంతాల్లోని పలు చోట్ల ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సోమవారం జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ పరిశీలించారు. బాధితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

బాధితులతో మాట్లాడుతున్న బల్దియా కమిషనర్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOTS FOR SALE
★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-000

CHANGE OF NAME
★I, KARTHEEK REDDY MATTA F/o MATTA ADITH REDDY R/o 6-2-41 KAKAJI COLONY HANAMKONDA WARANGAL TG 506001 GOT CHANGED MY MINOR SONS NAME TO MATTA AADITH REDDY.
NT-331741
★I, KARTHEEK REDDY MATTA F/o MATTA ARADYA SIRI REDDY R/o 6-2-41 KAKAJI COLONY HANAMKONDA WARANGAL TG 506001 GOT CHANGED MY MINOR DAUGHTERS NAME TO MATTA AARADHYA SIRI REDDY.
NT-331741

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

మెరుగైన సేవలపై దృష్టి సారించాలి

ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి అజిత్‌రెడ్డి

డైట్ కిచెన్‌ను పరిశీలిస్తున్న అజిత్‌రెడ్డి

వరంగల్ చౌరస్తా, సెప్టెంబర్ 2: రోగులకు మెరుగైన సేవలు అందించడంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి అజిత్ రెడ్డి అన్నారు. సీఎం ఆదేశాల మేరకు కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలిసి సోమవారం ఆయన ఎంజీఎం హాస్పిటల్‌ను సందర్శించారు. ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళి, ఆర్ఎంవో, వైద్యాధికారులతో మాట్లాడి ఓపీ, ఐపీ వైద్య సేవలు, శస్త్రచికిత్స వివరాలు తెలుసుకున్నారు. వైద్య విద్యార్థినులకు ప్రత్యేక గదులు, భద్రతా చర్యలు, సీసీ కెమెరాల ఏర్పాటు అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం రోగులకు అందించే డైట్ తయారీ వంట గదిని పరిశీలించారు. ఎంజీఎం ఆవరణలోని అంతర్గత రోడ్లు, శిథిలావస్థలో ఉన్న స్కూల్ ఆఫ్ నర్సింగ్, హాస్టల్ భవనాలను పరిశీలించారు. ఆయన వెంట వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, ఆర్ఎంవో డాక్టర్ కోడెం మురళి, డాక్టర్ అంబి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నెక్కొండ రైల్వేస్టేషన్ సందర్శన

నెక్కొండ, సెప్టెంబర్ 2: నెక్కొండ రైల్వే స్టేషన్‌ను రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, డీఆర్ఎం భరత్‌కుమార్‌జైన్ సోమవారం సందర్శించారు. మహబూబాబాద్ జిల్లా ఇంటికన్నెలో రైల్వేట్రాక్ కొట్టుకుపోయిన నేపథ్యంలో మరమ్మతులను పరిశీలించేందుకు ఆయన వచ్చారు. నెక్కొండ నుంచి ఓహెచ్ఈ టవర్‌కార్ ద్వారా రైల్వేట్రాక్ దెబ్బతిన్న ప్రాంతానికి చేరుకున్నారు.

నిలిచిన డ్రైవర్ ప్రాణాలు

నెక్కొండ, సెప్టెంబర్ 2: ఆటో డ్రైవర్ తృటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని వెంకటాపురం లోలెవల్ కాజ్‌వే పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఆదివారం రాత్రి వరంగల్ లేబర్ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ అశోక్ కేసముద్రం నుంచి వరంగల్‌కు వెళ్తున్నాడు. ఆటో కాజ్‌వై పైకి చేరగానే వరద నీటిలో కొట్టుకుపోతున్నది. డ్రైవర్ చాకచక్యంగా ఆటో నుంచి బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. సోమవారం స్థానికుల సాయంతో ఆటోను బయటకు తీశారు.

ఆటోను బయటకు తీస్తున్న స్థానికులు

క్రీడాకారిణి దీప్తికి అభినందనలు

పర్వతగిరి, సెప్టెంబర్ 2: కల్లెడ ఆర్డీఎఫ్ వనిత అచ్యుతపాయ్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థిని జీవంజి దీప్తి ప్యారిస్‌లో జరుగుతున్న పారా ఒలింపిక్స్‌లో బాలికల విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొననున్నది. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఆమెకు సోమవారం అభినందనలు తెలిపారు. ఒలింపిక్స్‌లో దీప్తి విజయం సాధించి, దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి విజయోస్తు దీప్తి.. అని పేర్కొంటూ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, దీప్తి విజయకేతనం ఎగురవేసి ఓరుగల్లు పేరును ప్రపంచానికి చాటాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆశీర్వదించారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

దుగ్గొండి, సెప్టెంబర్ 2: విద్యుదాఘాతంతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన గుడి మహేశ్వరంలో జరిగింది. గ్రామానికి చెందిన కూరతోట ప్రమీల ఇంట్లో బోర్డులో వైరును సరిచేస్తుండగా షాక్‌కు గురైంది. కుటుంబ సభ్యులు దవాఖానకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందింది. ఆమె కుమారుడు రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

'బిగ్‌బాస్'లోకి ఓరుగల్లు యువకుడు

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 2: బిగ్‌బాస్ సీజన్ 8లో ఓరుగల్లు యువకుడికి చోటు దక్కింది. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రాఘవేందర్ నగర్ కాలనీకి చెందిన నబీల్ ఆఫ్రిది ఈ నెల ఒకటిన ప్రారంభమైన బిగ్‌బాస్ హౌస్‌లోకి వెళ్లాడు. మహ్మద్ శౌకత్ అలీ-నజ్మ నుస్రత్ దంపతుల మూడో కుమారుడు నబీల్ అఫ్రిది బీకాం వరకు చదువుకున్నాడు. నబీల్‌కు ఎస్సెస్సీ నుంచే యాక్టర్ కావాలన్నది కోరిక. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత 'వరంగల్ డైరీ' పేరుతో యూ ట్యూబ్ ఛానల్ ఏర్పాటు చేసుకున్నాడు. మంచి ఆదరణ వస్తుండడంతో అవార్డులు, ప్రశంసలు అందుకున్నాడు. ఎలాగైనా బిగ్‌బాస్‌లో పాల్గొనాలనే పట్టుదలతో గతేడాది ప్రయత్నం చేసి విఫలమయ్యాడు. నిరాశపడకుండా మళ్లీ ప్రత్నించడంతో అతడిని నిర్వాహకులే పిలిచి బిగ్‌బాస్ 8లో అవకాశం కల్పించడంపై నబీల్ ఆనందం వ్యక్తం చేశాడు.